# ఋణం తీరింది

రచన :
"ప్రవీణ్ సుశ్రీ"

(గత సంచిక తరువాయి)

"ఆ! ఏమీలేదండీ! మన సీతను మాన్పించి నేను నీళ్ళు తీసుకవచ్చాను." అంతే!...అంది లక్ష్మి తన తప్పు అదే అన్నట్లుగా. విన్న శేఖరానికి మరి నవ్వాలో ఏడ్వాలోగూడా తెలీక...ఏమీ బదులు చెప్పకుండా...నొసలు నొక్కుకుంటూ భార్య వేపు అదోలా చూసి తన గదిలోకి వెళ్ళిపోయాడు. లక్ష్మి చేసిన పని తనకు అపరాధంలా అనిపించలేదు.

అక్కడున్న ఎవరికీ అతని బాధ అర్థంకాలా లక్ష్మికి తప్ప. వెంటనే ఏదో చీవాట్లుపెట్టి తండ్రికి తగ్గకొడుకనిపించుకుంటాడని ఆశించిన భుజంగరావుకి శేఖరు అలా మౌనంగా వెళ్ళడముతో! "ఒరేయ్! నిన్నేరా! వీధికుళ్ళాయినుంచి అది నీళ్ళు తెస్తుంటే! నీకన్నా సిగ్గులేదట్రా! రిటైర్డు తాసిల్దారు భుజంగరావు కోడలు నీళ్ళు తేవడమా? ఒరేయ్! వినిపించుకోకుండా అలా పోతావేంరా?" అని అరిచాడు. "అబ్బ! ఇంక చాల్లెద్దురూ! అబ్బాయికి బాగాలేదులావుంది" అంటూ వంట గదిలోకి వెళ్ళింది, పిల్లలందరూ వంట గదిలోనే వుండటంమూలంగా.

ఎటువాళ్ళు అటువెళ్ళిపోయారు. హాల్లో భుజంగరావు ఒక్కడే మిగిలిపోయాడు. శేఖరు డ్రస్సు మార్చుకుని ఉస్సురంటూ కుర్చీలో కూలబడిపోయాడు. అతనిలో ఏదో ఆశంక, అనిశ్చితత్వ, నిశ్చయంగా కల్గింది. కాంతగ్లానిగూడా దాంతోపాటు కల్గినట్లుగానే వుంది. విద్యుద్దీపకాంతిలో అతని ముఖం అస్పష్టంగానే వుంది. ఆ ముఖంలో ఎంత వెదకినా కాంతి రేఖలు అగుపించడం లేదు, పాలిపోయివుంది, విషాద రేఖలు నలుమూలలా అలముకున్నయ్! ఫాల భాగంమీద పట్టిన చెమట బిందువులు ఆ విద్యుద్దీప కాంతిలో పాదరసంలా తళతళ మెరసిపోతున్నాయ్! నొసలు బాగా నొక్కుకుంటూ అలానే కళ్ళు మూసుకున్నాడు శేఖరు.

లక్ష్మి భర్త అవస్తంతా ఎప్పటినుంచో చూస్తోంది...గాని ఆబాధలోని గూడార్థాన్ని అర్థం చేసుకోలేకపోతూంది.

"ఏమండీ! అలా వున్నారేం? ఒంటిలో సరిగ్గా లేదా?" అంది శేఖరు దగ్గరగా వస్తూ.

శేఖరు ఒక్కసారిగా త్రుళ్ళిపడ్డాడు. అసలామె అక్కడికి రావడము అతను గమనించనేలేదు... అదోలా నిరుత్తరుడై ఆమె కళ్ళల్లోకి చూశాడు. జవాబులేని కారణాన్ని లక్ష్మిలో ఆ వేగం హెచ్చింది. "ఏమండీ! మిమ్మల్నే!...మాట్లాడరేం?"

"ఆ!...అబ్బే! ఏమీలేదు...కాస్త తలనొప్పిగా వుంది, అంతే! తడబడుతూ అన్నాడు శేఖరు.

"కాఫీ వేడిచేసివ్వమంటారా?"

"వద్దు లక్ష్మి! అదే! తగ్గిపోతూంది...ఆ! బుజ్జిగాడేడీ?" అని లేని ఓపిక తెచ్చుకుని అడిగాడు.

"వాడు ఆ గదిలో నిద్రపోతున్నాడు లెండి! తెస్తానుండండి!" అంటూ లక్ష్మి వెళ్ళిపోయింది.

శేఖర్ లక్ష్మివేపు ఒకసారి చూసి మరలా కళ్ళు మూసుకున్నాడు.

*  *  *

భగవంతుడు మనకు రోజులు ప్రసాదించాడుగానీ అన్నీ సుఖంగానూ, కష్టంగానూ పంచిపెట్టలేదు. ఎన్నడూ విచారం ఎరుగని కోటయ్య ఈనాడు కష్టాలు అనుభవించాల్సి వచ్చింది...లక్ష్మమ్మకు కడుపులో ఏదో వ్రణము లేచిందని అది పెద్ద ఆపరేషను చేస్తేగాని గుణపడదని, వైజాగ్ పెద్ద హాస్పిటలుకు వెళ్ళాలని పరీక్షించిన గవర్నమెంటు డాక్టరు చెప్పాడు.

సమయానికి కోటయ్యవద్ద అంత డబ్బు లేకపోయింది కోటయ్య దుఃఖానికి ఓ పరిధ అంటూ లేఃపోయింది... నిద్రాహారాలు మానివేశాడు. ఆ దిగులుతో కోటయ్య చిక్కి శల్యమైపోయాడు, కోటయ్య తన భార్యను తనకు దక్కించమని కోటి దేవుళ్ళకు మొక్కుకున్నాడు. ఎన్నడూ తన మదిలో అనుకోని ఆపదవచ్చి పడింది.

"డబ్బు కావాలి" ఈవరకు తానే ఇతరులకు సహాయం చేయగలిగాడు. గాని ఇప్పుడు తనే ఇంకొకరిని ఆశ్రయించాల్సి వచ్చింది. కనీసం రెండుమూడు వందలైనా కావాలి. ఎక్కడినుంచి తేవడం? నేనడిగితే అంత మొత్తం ఒక్కసారిగా ఎవరిస్తారు? పోనీ శేఖరం బాబుని అడగితే? పాపం ఆయనమాత్రం ఎక్కడినుంచి తేగలడు? ఎలాగూ రేపే వైజాగ్ వెళ్ళాలి? ఆయన తప్ప ఇంక నాకెవరున్నారు? తనదగ్గర లేక పోయినా ఎక్కడైనా అడిగి నాకు సహాయంచేయగలడు. ఆయన అడిగితే ఎవరైనా ఇస్తారు. ...అంత మొత్తం ఆయనకైనా ఎవరివ్వగలరు? ఏం మేనేజరుగారివ్వలేరా? ఏమైనాసరే శేఖరు బాబునే అడగాలి ఇలా కోటయ్య నిర్ధారించేసుకుని శేఖరం దగ్గరకు వెళ్ళాడు అనాలోచితంగా.

* * *

శేఖరానికి ఆరోజు రాత్రి ఎగస్ట్రాగా ఆఫీసులో పని తగిలించాడు మేనేజరు. తను హెడ్ గుమాస్తా కాబట్టి వప్పుకోక తప్పింది కాదు. శేఖరు కుర్చీలో కూర్చున్నాడన్నమాటేగాని, అతడు ఎటు చూస్తున్నాడో! అసలు ఏమి చేస్తున్నాడో! అతనికేమీ తెలియడంలేదు. కోటయ్య మధ్యాహ్నం తనవద్దకువచ్చి కంట తడిపెట్టగా ఆ బాధ చూడలేక డబ్బు ఇస్తానని మాట ఇచ్చాడేగాని, అసలు ఎలా సంపాదించి ఇవ్వాలో అతనికిప్పటికీ అంతుచిక్కడము లేదు. ఎలా సంపాదించాలన్నదే ఇప్పుడతనికో పెద్ద సమస్యగా తయారైంది. కోటయ్యకిస్తానన్న డబ్బు ఎలా సంపాదించడము? ఈరాత్రికే అతని భార్యను వైజాగ్ పంపాలట ఎలా? నాకెన్నిసార్లు సహాయం చేశాడు. ఈసమయంలో గాకుంటే... అతనికింకెపుడు నేను సహాయం చేయగలను. అతని ఋణం ఎప్పుడు ఎలా తీర్చుకోగలను, శేఖరు మస్తిష్కం ఇలా ఏమిచేయడానికి పాలుబోక తికమక పడ్తోంది!...ఇలా నైట్ వర్కు వేసినందుకు మేనేజర్ను మనస్సులో బాగా తిట్టుకున్నాడు.

ఆ వెలుగుతూన్న ఎలక్ట్రిక్ లైట్లన్నీ...భూతపిశాచాల్లా అతని కంటికి కన్పిస్తున్నాయ్! గోడమీది బొమ్మలన్నీ తనకేసి వికృతంగా నవ్వుతూన్నట్లుగానే అనిపించిందతనికి...అతనికి పిచ్చిఎత్తినట్లుగానే వుంది!...శేఖరు మెదడు ఇటువంటి ఉద్విగ్న చిత్తప్రవృత్తులతో బాగా వేడెక్కింది రైలు ఇంజనులా! దాన్ని చల్లపరుద్దామని నెత్తిమీద ఫాన్ తిరుగుతూన్నప్పటికి ఈ ఆలోచనలతో అతని బుఱ్ఱ మరీ వేడెక్కుతూందేగాని! చల్లబడలేకబోతూంది...కానీ ఫాన్‌మాత్రం చిన్న బుచ్చుకోవడము లేదు...జోరుగా గిర్రున తిరుగుతోంది అతని చేతులు పనిని చేయడం పూర్తిగా మానుకున్నాయ్! శేఖరు తలెత్తిచూశాడు. ఎదురుగ్గా

ఏం...

TEX TOM
Trade Mark
BANIANS

కుటుంబానికి కావలసినవాటిని ఎన్నుకోండి !!

- టెక్స్‌టామ్ -

* బనియన్లు. * డ్రాయర్లు.

* చెడ్డీలు. * కట్‌బాడీలు.

తయారించువారు :—

టామ్‌టెక్స్ నిట్టర్స్, తిరుప్పూరు - 638602.

కొంతదూరంలో మేనేజరు మాత్రం ఈ లోకంతో నాకేమీ సంబంధం లేదన్నట్లుగానే ఏమిటో వ్రాసుక బోతున్నాడు...మేనేజరు దగ్గరగానే ఖజానా పెట్టె వుంది. శేఖరు కంటికి అది నిండుగా కన్పించింది. ఇందాక ఒకసారి చూచినప్పుడు మేనేజరు డబ్బు ఎంతో లెక్కపెట్టి, అందులోవుంచి తాళము బిగించాడు. ఇపుడతనిలో క్రొత్తక్రొత్త ఆలోచనలు పిలకల్లా మొలకలెత్త సాగాయ్! లైట్ల కాంతులన్నీ మరి ఏమయ్యాయో గానీ, శేఖరు చుట్టుమాత్రం దట్టంగా కటిక చీకటి ఆవరించినట్టుగానే వుంది. అతని కళ్ళ ముందు ఏవేవో అస్పష్టంగా సుడులు తిరుగుతూనే వున్నాయ్!...ఆ సుడుల్లో ఇనప్పెట్టెగూడా తిరుగుతూ న్నట్టుగానే వుంది.

అబ్బా! నోట్లకట్టలు, షాపుల్లో ఇస్త్రీచేసి పర్చిన బట్టలులా దొంతర్లు, దొంతర్లుగా పదిలంగా పర్చివున్నాయ్! అతని కంటికి మేనేజరు, ఇనప్పెట్టె మాత్రమే ఇపుడు అగుపిస్తోంది.

మరింకేమీ అగుపించడము లేదు. అతనిలో ఓ తుచ్ఛపు కోర్కె ఈవరకే కల్గింది కాబట్టి, అది ఇప్పుడు దృఢపడి లోన తిష్ట వేసుకుని ధైర్యాన్ని చేస్తోంది. శేఖరు మెల్లగా తన సీట్లోంచి లేచాడు. గోడగడియారం 'టంగ్' మని అరగంట కొట్టి పూరుకుంది, బండి వచ్చేవేళకి ఇంకో అరగంట మాత్రమే వుంది. శేఖరు చేతులు ఎందుకో వణికిబోతున్నాయి! కాళ్ళూ అంతే! ఆ వణకుతూన్న చేతులే రూళ్ళకట్టను తీసుకున్నాయి! ఆ చేతులకది అపరిచిత వస్తువైనా ధైర్యంగానే గట్టిగా పట్టుకున్నాయి! ఎన్నడూ తన జీవితంలో చేయని పనిని తానిపుడు చేయబోతున్నాడు. "అందరికి తెలుస్తుంది. నా లక్ష్మి నన్ను అసహ్యించుకుంటూంది. అంతే కాదు, ఈ లోకమే నన్నో క్షుద్ర పురుగుని చూచినట్లుగా తీక్షణంగా చూస్తుంది. ఉరి తీస్తారు...అమ్మో! కాదు జీవితఖైదు వేస్తారు!...నా బుజ్జి...! ఛీ!" అతని మస్తిష్కంలోని మరలు బాగా పని చేస్తూవున్నాయి! కాళ్ళు గజగజలాడుత్తున్నాయి! తాను నిలుచున్న చోటునే భూమి కంపించిబోతున్నట్లుగా వుంది. నిలువ లేకబోయాడు. అంతా నిశ్శబ్దం. గడియారం 'టక్కుటక్కు' శబ్దం తప్ప.

"ఎవరది?...మనిషి కాదు!...ఎవరిదో! ఆకారం! ...కోటయ్య! ఎందుకలా దీనంగా నిలబడివున్నాడు! ఓహ్! నేను డబ్బు ఇస్తానన్నాను గదూ!...నాకోసం కళ్ళల్లో వత్తులుపెట్టుక నిరీక్షిస్తూన్నాడు కాబోలు... ఎలా నిజమే! ఇస్తానన్నాను!"

"హు! పిరికివాడా! కోటయ్యను అన్యాయం చేస్తావా, అతను నీకెన్నోసార్లు సహాయంచేశాడే! నీ బుజ్జిబాబును ఒకసారి బ్రతికించాడే,...మరిప్పుడతనికి సహాయం చేయలేవూ! అతని భార్యను బ్రతికించలేవూ ...ఛీ! అదిగో!...అటుచూడు! ఖజానా పెట్టె! ఎవ్వరూ లేరులే! నీ పని తొందరంగా కానీయ్!... ఊ!...లే!..." అంతరాత్మ దుర్బోధనతో సముద్రుడిలా ఘోషిస్తోంది. శేఖరానికి ధైర్యమొచ్చింది. లేచాడు, సీట్లోంచి—అతని కాలికి గట్టిగా ఏదో తగిలింది ... వంగితీశాడు ... ఇది ఇక్కడి కెందుకు వచ్చింది...."ఇనుపముక్క"! అరే! భగవంతుడు ప్రోత్సహిస్తాడా, ఏమిటో! అయిన ఏమిటీ మరీనేను! ...అతనికి అది చేతిలోనికి రాగానే! ఎక్కడలేని వెయ్యి ఏనుగుల బలం ఒక్కసారిగా పుంజుక వచ్చేసినట్లైంది. ఇప్పుడతని చేతులు వణకడం లేదు. గుండె వేగంగా కొట్టుకోవడంలేదు. కాళ్ళూ చేతులూ వణకడంలేదు. హృదయ స్పందనలేదు. ఆత్మదుర్బోధ స్పందనే ఇపుడుంది. అంతే శేఖరు మెల్లగా మేనేజరు దగ్గరగా వెళ్ళాడు. అంతే! అంతే!...ఒక ఘోర కార్యం అలా జరిగిబోవాల్సుందారోజు.

♦ ♦ ♦

కాలచక్రం బండి చక్రంకన్నా వేగంగా గిఱ్ఱున తిరిగి ఆరు నెలల పది రోజుల్ని సూచించింది.

వైజాగ్ వెళ్ళిన కోటయ్య భార్యతో సురక్షితంగా స్వగ్రామం చేరుకున్నాడు. తన భార్యను కాపాడిన ప్రాణదాత, ఆ భగవంతునికన్నా ముందు శేఖరాన్నె చూడాలని కోటయ్య తలంచి పండ్లూ, పూలూ పట్టుకుని శేఖరం ఇంటికి వెళ్ళాడు. గాలికంటె వేగంగా శేఖరం ఇల్లు చేరుకున్నాడు గానీ, ఇంటికి తాళంవేసి వుంది. పైగా "ఈ ఇల్లు అద్దెకు ఇవ్వబడును" అని. త్యాళఫల ప్రమాణంబోలిన అక్షరాలతో దిగులుగా ఓ బోర్డు వ్రేలాడివుండటం అతనికి నిరాశను కలిగించాయి.

(సశేషం)